మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## హాస్టల్ ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బందికి షోకాజ్ నోటీస్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

నారాయణఖేడ్ మండల పరిధిలోగల జుక్కల్ శివారులోని మినీ గురుకులంలో కొన్ని రోజుల నుంచి మెనూ ప్రకారం భోజనం పెట్టలేదంటూ విద్యార్థులు గురువారం జాతీయ రహదారిపై ధర్నాకు దిగి, ప్లేట్స్ విసిరేస్తూ గురువారం ఆందోళనకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ రావుల శ్రీశైలం సిబ్బందితో పాటు రెవెన్యూ ఆఫీసర్ వెళ్లి విద్యార్థులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులతో, అక్కడ వున్నా ఉపాధ్యాయులతో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులును పై అధికారులకు అక్కడ నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు వెల్లడించారు. అయితే అక్కడ నెలకొన్న సమస్యలపై అధికారులు ఆరా తీసి దానికి బాధ్యులైన హాస్టల్ ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్, ఫుడ్ సేఫ్టీ కమిటీ, వంట మనుషులకు జిల్లా గిరిజన అధికారి షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది. దీనికి సంబంధించి పూర్తీ సమాచారం పై అధికారులకు తగిన చర్యలకై పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

## నిర్మాణ పనులు నిలిపివేయాలని హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలోగల సురభి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సురభిహాస్పిటల్) చేపట్టిన నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశిస్తూ హైకోర్టు యదాతథ స్థితి(స్టేటస్ కో) ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్‌గౌడ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా ఆధారాలతో దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారించి నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులకు కోర్టు షోకాజ్ నోటీసులు జారీచేసిందని వివరించారు. పిటిషనర్ తరపున న్యాయవాది పల్లె వినోద్‌కుమార్‌రెడ్డి కోర్టులో వాదనాలు వినిపిస్తూ గతంలో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు పలు మార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా కాలేజీ యాజమాన్యం నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపట్టిందని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తివివరాలతో రెండు వారాల్లోపు ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ శ్రవణ్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తూ తదుపరి విచారణ వాయిద వేసినట్లు తెలిపారు.



గజ్వేల్ ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

# అభ్యర్థుల భవిష్యత్ తేలేది నేడే

**నాలుగు మున్సిపాలిటీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు**

**ఓట్ల లెక్కింపునకు గజ్వేల్‌లో 14,**

**చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్‌లో 7 టేబుళ్ల ఏర్పాటు**

**మూడు రౌండ్లలో వెలువడనున్న ఫలితాలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, చేర్యాల,దుబ్బాక మున్సిపాలిటీలకు ఈనెల 11న బ్యాలెట్ పేపర్ ద్వారా పోలింగ్ నిర్వహించగా నేడు(శుక్రవారం) ఓట్ల లెక్కింపు చేపట్టడానికి ఆయా మున్సిపాలిటీలోని కౌంటింగ్ కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలోని 72 వార్డులకుగానూ 326 మంది బరిలో నిలవగా అభ్యర్థుల భవితవ్యం నేడు తెలనుంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపును గజ్వేల్ పట్టణంలోని బాలికల విద్యహబ్‌లో, చేర్యాల కౌంటింగ్ తెలంగాణ గురుకుల పాఠశాల, దుబ్బాక కౌంటింగ్ లచ్చపేటలోని మోడల్‌స్కూల్, హుస్నాబాద్ కౌంటింగ్ పిఎంశ్రీ టిజి మోడల్‌లో స్కూల్‌లో చేయనున్నారు. ఓట్ల లెక్కింపుకు గానూ గజ్వేల్‌లో 14, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాకలో 7 చొప్పున మొత్తం 35 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌ను మూడు రౌండ్లలో పూర్తి చేయడానికి అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క రౌండులో 7 వార్డుల ఫలితాలు రానున్నాయి. చేర్యాల మున్సిపాలిటీలో 13777 ఓటర్లకుగానూ 11,491 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. దుబ్బాకలో 21341 ఓటర్లకు గానూ 18,150 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. గజ్వేల్‌లో 46740 మంది ఓటర్లకు గానూ 37,088 మంది, హుస్నాబాద్‌లో 19,227 మంది ఓటర్లకు గానూ 16,192 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేర్యాల మున్సిపాలిటీ ఫలితం మొట్ట మొదట రెండు రౌండ్లలో తెలనుంది.

## ఎన్నికల కౌంటింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు

**-13 హాల్స్‌లో 39 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు**

**జహీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల ఎన్నికల్లో పోలైన ఓట్లను ఈ నెల 13న లెక్కించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్ పరిధిలోని 37 వార్డులకు గాను 13 హాల్‌లలో ఒక్కో హాల్‌లో 3 టేబుల్‌ల చొప్పున ఏర్పాటు చేసిన 39 టేబుల్‌లపై ఓట్లను వార్డుల వారిగా లెక్కించనున్నారు. పోలైన ఓట్లను 25 ఓట్ల చొప్పున బండిళ్ల ఏర్పాటు చేసి, ఆ తర్వాత గుర్తులను విడదీసి చివరగా ఓట్లు లెక్కించడం చేస్తారు. కౌంటింగ్‌లో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి గురువారం కౌంటింగ్ కేంద్రం మున్సిపల్ కమిషనర్ జైత్రం, తహసీల్దార్ పి దశరథ్, మాస్టర్ ట్రైనర్లు తులసీరామ్ రాథోడ్, డి శ్రీనివాస్‌లు శిక్షణ నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గందరగోళం చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

### జాతర ఏర్పాట్లు ఘనంగా ఉండాలి : అడిషనల్ కలెక్టర్



ఏడుపాయల్లో జాతర ఏర్పాట్లు పరిశీలించిన అడిషన్ కలెక్టర్ నగేష్

**పాపన్నపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఏడుపాయల జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం ఆయన ఏడుపాయల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. ఇప్పటికే జాతర ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నిర్దేశించిన స్థలాల్లోనే భక్తులు స్నానాలు చేయాలని కోరారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, గోవింద్‌నాయక్, ప్రశాంత్‌రెడ్డి, ఇఓ వీరేశం ఉన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

**-ప్రజాబాటలో రూరల్ జోన్ ఇంజనీర్ బాలస్వామి**

**వర్గల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తినా త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని రూరల్ జోన్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాబాట కార్యక్రమాన్ని గురువారం వర్గల్‌మండల పరిధిలోని తునికిఖాల్సా గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రూరల్ జోన్ ఇంజనీర్ బాలస్వామి గ్రామంలోని విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్ లక్ష్మి కొండల్‌రెడ్డిలు గ్రామానికి సింగిల్‌ఫేజ్ డిటిఆర్ మరియు కొత్త స్ట్రీట్ లైన్ పనుల గురించి ఇంజనీర్‌కు వివరించగా వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఇంజనీర్ బాలస్వామి మాట్లాడుతూ రాబోయేది వేసవి కాలం అయినందున విద్యుత్ వినియోగం పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని మండలంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్, గజ్వేల్ డివిజనల్ ఇంజనీర్ భానుప్రకాశ్, ములుగు అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, వర్గల్ అసిస్టెంట్ ఇంజనీర్ వాసుదేవరావు, సిబ్బంది నర్సింలు, చంద్రం, నవీన్, అశోక్, చందు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ లైన్‌లను పరిశీలిస్తున్న అధికారులు

# మున్సిపల్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ టౌన్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల్ కౌంటింగ్‌కు అన్ని ఏర్పాటు పూర్తయ్యాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌లతో కలసి గురువారం పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నియమాలను పాటించి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పక్రియ జరగాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామని, రేపు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవు తుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతి భద్రతకు భంగం కలగకుండా చర్యకు చేపదు తున్నామని చెప్పారు. కౌంటింగ్ నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమం లో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, మెదక్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాధకిషన్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

**కౌంటింగ్‌లో ఆర్వోల పాత్ర కీలకం...**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఆర్వోలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎన్నికల అధికారులకు సూచించారు. గురువారం వెస్లీపాఠశాలలోని మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాలును జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీవో రమాదేవితో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు,సలహాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ కు పోలీస్ మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ రోజు ఆర్వోలు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు,ఉదయం 5:45 లోపల కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు.కౌంటింగ్ హాలులో ఫోను అనుమతి లేదన్నారు.ఓట్ల లెక్కింపు రౌండ్లవారీగా, టేబుల్ వారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిం చారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.ఈ కార్య క్రమంలో మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్వోలు, సూపర్వైజర్లు అసిస్టెంట్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

### అంతర్జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడమే

# సిఎం కప్ ఉద్దేశం : కలెక్టర్ హైమావతి



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడమే సిఎం కప్పు ఉద్దేశమని సిద్దిపేట జిల్లా కలెక్టర్, స్పోర్ట్స్ చైర్మన్ కె.హైమావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన సెకండ్ ఎడిషన్ సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించి మాట్లాడారు.గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులను క్రమ శిక్షణగల పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత పీఈటీలపై ఉందన్నారు. విద్యార్థులు ఏదో ఒక క్రీడలలో పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక,మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. టీంస్పూర్తితో క్రీడల్లో పాల్గొని చివరి అవకాశంవరకు గెలుపుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి సిద్దిపేట బ్రాండ్‌ను కొనసాగిం చాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి సిఎంకప్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపికచేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో విజేతలుగా నిలిచే క్రీడాకారులకు స్వర్ణపతకానికి రూ.25000, రజత పతకానికి రూ.15 వేలు, కాస్య పతకానికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందజేయడం జరుగుతుం దని తెలిపారు.కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, డిఎస్సీ డివో హమీద్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ రవి నాయక్, పాఠశాల క్రీడా కార్యదర్శి సౌందర్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి పోటీల ప్రారంభ సూచికంగా శాంతి కపోతాలు ఎగరవేసి క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు.

## విద్యుత్ సవరణ బిల్లు 2025ని వెనక్కి తీసుకోవాలి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

కేంద్రంలోని బిజెపి సర్కార్ తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను, విద్యుత్, ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దానిస్థానంలో తెస్తున్న వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని సీపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌స్వామి, హెచ్‌ఎంఎస్ జాతీయ నాయకుడు సుదర్శన్‌రావు, బిఆర్‌టియు రాష్ట్ర నాయకులు నారాయణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి లక్ష్మణ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో స్థానిక చర్చి కాంపౌండ్ నుంచి పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన సవరణ బిల్లు, ఎల్‌ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, వివిధ కార్మిక సంఘాల నాయకులు శశిధర్, వెంకట్, పద్మ, బాల్‌నర్సయ్య, రవికుమార్, కనకయ్య, శోభ శిరీష, అరవింద్, సంజీవులు, నరసింహులు, శ్రీనివాస్, సంపత్, చంద్రం, మధు, కౌసల్య లలిత, కార్మికులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# లేబర్ కోడ్లతో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**



సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

లేబర్‌కోడ్లతో కార్మిక హక్కుల హత్య చేయబడతాయని, హైర్ అండ్ ఫైర్‌తో శ్రమదోపిడీకి చట్టబద్ధత కల్పించడమే తప్ప మరోటి కాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చుక్కా రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులు ఏకం కావాలన్నారు. కార్మికుడి కడుపు ఆకలి.. హక్కుల పోరాటంలో పాల్గొనని బిఎంఎస్ కార్మిక వ్యతిరేకే అన్నారు. ఇప్పటివరకు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను మరింతగా దోచుకునే విధంగా లేబర్ కోడ్లు రూపొందించారని చెప్పారు. లేబర్ కోడ్ల ద్వారా వేతనాల నిర్ణయంలో ఉన్న త్రైపాక్షిక విధానాన్ని రద్దు చేసి, 'ఒకే దేశం ఒకే వేతనం' పేరుతో రోజుకు రూ.178 కనీస వేతనం నిర్ణయించడం ద్వారా కార్మికుల ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడిందని అలాగే పని గంటలను 8 నుంచి 12కు పెంచి, ఓవర్‌టైంకు అదనపు వేతనం చెల్లించకుండా చేస్తున్నారని ట్రేడ్ యూనియన్ నమోదు నిబంధనలను కఠినతరం చేసి, కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీస్తున్నయని పరిశ్రమల లేఆఫ్,లాకౌట్, మూసివేతలకు సంబంధించిన నిబంధనలను సడలించి, యజమానులకు అనుకూలంగా మార్చారని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్‌వంటి హక్కులను కాంట్రాక్ట్ కార్మికుల నుంచి క్రమంగా తొలగించే విధంగా కోడ్లు రూపొందించారని అనేక రాష్ట్రాల్లో ఉన్న కార్మిక సంక్షేమ బోర్డులను రద్దుచేసి, కార్మికుల విద్య, వైద్యం, వివాహ, ప్రసూతి సహాయాలను నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ దొడ్డిదారిగా అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. లేబర్‌కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్మికులకు శిక్ష యజమానులకు రక్ష అనే విధానాన్ని అమలుచేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ రావు మాట్లాడుతూ ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం దారదత్తం చేస్తుందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం, విద్యుత్ సవరణ చట్టం 2025, విబిజీ రామ్ చట్టం, విత్తన సవరణబిల్లు, ఎల్‌ఐసిలో విదేశీ పెట్టుబడుదారులను అనుమతించడం, ఇలాంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి, కార్మికుల శ్రమను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బీరం మల్లేశం, యాదగిరి, బాగారెడ్డి, ప్రసన్నరావు, రామదాసు, వెంకటరెడ్డి, శివ, అశోక్, కృష్ణ, వివిధ పరిశ్రమ రంగాల నాయకులు, కార్మికులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎంఎ రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటరాజ్యం, సెకండ్ ఏఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శి శ్యామల, శివశంకర్, లక్ష్మి, వడ్డే అంజయ్య, బిహెచ్‌ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.ప్రవీణ్, బాలరాజ్, శంకరప, ఏఐటీయూసీనాయకులు లింగమయ్య, జిల్లా కోశాధికారి జి.ఆంజనేయులు, సంతోష్‌గుప్త, సాయికుమార్, ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయిన్ ప్రసాద్, పాడి పాల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి, సయెద్ సమద్ పాల్గొన్నారు.



ఉడిపి హోటల్ యజమానికి ఫైన్ రశీదు అందిస్తున్న అధికారులు

'వార్త' ప్రభావం

## గణేష్ ఉడిపి హోటల్‌కు జరిమానా

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** 'ప్లాస్టిక్ రహిత సమాజం కలేనా, గాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ నిబంధనలు, మంత్రి ఆశయానికి గండి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు' శీర్షికలతో గురువారం వార్త పత్రికలో ప్లాస్టిక్ వినియోగంపై ప్రచురితమైన 'వార్త'కు మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్‌గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌లో ప్లాస్టిక్ వినియోగంపై సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో గల గణేష్ ఉడిపి హోటల్‌లో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఉన్నట్లు గుర్తించి యాజమాన్యానికి రూ. 2 వేల జరిమానా విధించారు. అలాగే భవిష్యత్తులో ప్లాస్టిక్ వినియోగం చేయకుండా నిబంధనలు పాటించాలని హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం మున్సిపల్ ఎస్ఐ బాల ఎల్లం మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి మున్సిపల్ శాఖ తనిఖీలు కొనసాగుతాయని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కొనసాగుతున్న కెసిఆర్ కప్పు క్రికెట్ టోర్నమెంట్

**మర్కుక్, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):** మాజీ సీఎం కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మర్కుక్‌లో ఏర్పాటుచేసిన కెసిఆర్ కప్పు క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్‌కు చేరుకుంది. గురువారం నిర్వహించిన క్రికెట్ సెమీఫైనల్‌లో పాములపర్తి జట్టుతో పోటీపడిన మర్కుక్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు బొద్దుల ప్రవీణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఉపసర్పంచ్ సాయిమహేష్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, సతీష్ గౌడ్, బాబు, సంతోష్, ప్రవీణ్, నరేష్, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో అక్రమాలు జరిగితే సహించం

**జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రంగాచార్యులు**

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో అవినీతి జరగకుండా, జరిగిన అవినీతిని వెలికి తీసేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రంగాచార్యులు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీలలో రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే సహించే ప్రసక్తే లేదని జిల్లా అడిషనల్ పీడీ రంగాచార్యులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల వివరాలను ప్రజాదర్బార్‌లో గ్రామపంచాయతీ వారీగా వెల్లడించారు. సామాజిక తనిఖీలో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని గ్రామాల్లో ఎంబీ రికార్డు లేకుండానే బిల్లులు చెల్లించడం, పనులు చేయకపోయినా కూలీల పేర్లు రికార్డుల్లో నమోదు చేయడం, ఉపాధి హామీ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంలో సిబ్బంది నిర్లక్ష్యం కనిపించినట్లు తెలిపారు. 2024-2025 వార్షిక సంవత్సరంకు రూ. 7కోట్ల 56లక్షల 74వేల రూపాయలతో 345 అభివృద్ధి పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ కూలీల ఖాతాలో రూ.6 కోట్ల 36లక్షల 44వేల రూపాయల నగదును జమ చేశామని అన్నారు. రూ.1కోటి 20లక్షల 29వేల రూపాయలతో వివిధ రకాల సామాగ్రిని కొనుగోలు చేశామన్నారు. రూ.28,860/రూపాయల నగదు రికవరీ చేయాలని, రూ.5వేల రూపాయల పెనాల్టీని విధించినట్లు తెలిపారు. ఎస్. కొండాపూర్‌లో ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయని, ఫీల్డ్ అసిస్టెంట్ నాగులుకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ రంగాచార్యులు, హెచ్ఆర్ రాజేందర్, ఎస్‌టిఎమ్ మేనేజర్ అంజాగౌడ్, విజిలెన్స్ అధికారి శ్రీహరి, సోషల్ ఆడిట్ సంపత్,ఎస్ ఆర్పీ నాగరాజు, మండల ఏపీఓ రాజకుమార్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మోహన్ నాయక్‌తోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు,కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు సర్పంచులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

## అక్రమ ఇసుక రవాణాదారులకు జరిమానా

**హత్నూర ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** హత్నూర మండలం పన్యాల గ్రామం పరిధిలోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమంగా తీసి, నిల్వ చేసిన ఏడు మందికి జరిమానా విధించినట్లు తహసీల్దార్ ఫర్హీన్ షేక్ గురువారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని ఫిర్యాదు రావడంతో, గత శుక్రవారం పన్యాల గ్రామాన్ని సందర్శించి అక్కడ నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేశామని, నిలువ చేసిన 14 మందిని గుర్తించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం చెట్టుకింది సత్యానారాయణ, దొంతుల యాదగిరి, తలారి కృష్ణ, ఆరట్ల నాగరాజు, కలాలి మనోహర్ గౌడ్, గంటబోయిన రవీందర్, తలారి సత్యనారాయణలకు ఒక్కొక్కరికి రూ. 16,400చొప్పున జరిమానా విధించగా వారు చెల్లించారని తెలి పారు. మరో ఏడు మంది జరిమానా చెల్లించాల్సి ఉందని ఫర్హీన్‌షేక్ చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తా వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... కొర్విపల్లి తండాకు చెందిన పూల్‌సింగ్ నడుచుకుంటూ వెళుతుండగా మదూర్ నుండి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ నారాయణగౌడ్ క్షతగాత్రుడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరధి సూరారంలో గురువారం చోటు చేసుకుంది. సూరారం గ్రామానికి చెందిన యాదగికి ద్విచక్రవాహనంపై చిన్నశంకరంపేటకు వెళ్తుండగా గ్రామ శివారులోని చెరువు కట్ట సమీపంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# నేడు నర్సాపూర్లో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

-మూడు రౌండ్లలో ఎన్నికల ఓట్ల లెక్కింపు.. ఆ తర్వాత ఫలితాలు వెల్లడి.
-ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త):** నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరిగిన అనంతరం ఎన్నికల ఓట్లను కౌంటింగ్ చేసేందుకు నర్సాపూర్ పట్టణంలోని బివిరాజు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. బివిఆర్ఐటి కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని వసతులు ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డిలతో కలిసి అన్ని వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు జిల్లా కలెక్టర్ సూచించారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 15 వార్డులు ఉండగా మూడు రౌండ్లలో ఎన్నికల కౌంటింగ్ పూర్తిచేసి ఫలితాలను వెల్లడించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మొదటిరౌండ్‌లో 1,4,7,10,13 వార్డుల లెక్కింపు జరగనుందని అదేవిధంగా రెండవ రౌండ్‌లో 2,5,8,11,14 మూడవ రౌండ్‌లో 3,6,9,12,15 వార్డుల ఓట్ల లెక్కింపు జరుగుతుందని అనంతరం ఫలితాలను వెల్లడిస్తామని ఆయన తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ మేరకు కౌంటింగ్ కేంద్రాలను వచ్చే నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏ విధంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయో అదే విధంగా ప్రజలందరూ సహకరించి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా జరిపించడానికి సహకరించాలని కోరారు. ఈమేరకు పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ 2026 సంవత్సర క్యాలెండర్‌ను నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్విజయ్ సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎస్సై శ్రీశైలం, నాగల్‌గిద్ద ఎస్సై రామకృష్ణ, సంస్థ రాష్ట్ర కార్యదర్శి దత్తురెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి. ఓంప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఏ ఖైసర్, బాధ్యులు సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ జడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలన



స్వయంపాలన దినోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు

**సదాశివపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
గురువారం సదాశివపేట మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆత్మకూర్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో కలెక్టర్: జి.సంజన, ఆర్జేడి: వి.ప్రవీణ్‌కుమార్, డిఈవో: డి.ఫయాజ్, ఎంఈవో: పి.చంద్రశేఖర్, హెచ్‌ఎం: కె.వర్షిత, సబ్జెక్ట్ టీచర్లు, ఇతర బాధ్యతలను స్వీకరించి ఒకరోజు పాఠశాల పరిపాలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రామకోటయ్య, టీచర్స్, సిఆర్పి రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

## గ్రామ అభివృద్ధికి పరిశ్రమ చేయూత



బోరును తవ్విస్తున్న కావేరి పరిశ్రమ యజమాన్యం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధికి పరిశ్రమ ముందుంటుందని పరిశ్రమ యజమాన్యం తెలిపింది. గురువారం చిన్నశంకరంపేట మండలపరిధి ఖాజాపూర్ తండాలో సిఎస్ఆర్ నిధులతో కావేరి పరిశ్రమ యజమాన్యం మంచినీటి కోసం బోరుబావిని తవ్వించారు. కార్యక్రమంలో తండా సర్పంచి ప్రియానాయక్, ఉపసర్పంచి నరేష్, పరిశ్రమ సిబ్బంది అశోక్‌శర్మ, సంతోష్‌గౌడ్, వార్డు సభ్యులు శంకర్, రాజు, భానుచందర్, సూర్యానాయక్, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం బోరు వేయించిన సర్పంచి



బోరు వేయిస్తున్న సర్పంచి సుజాత మాంజా

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గుజిరి తాండ గ్రామంలోని తాగునీటి నీటివసతికొరకు ప్రభుత్వ నిధులతో గురువారం బోరుబావి తవ్వకాల పనులను సర్పంచి సుజాతమాంజా ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపసర్పంచి మోనిక మాంజా, వార్డుమెంబర్ సర్వవన్, దేవిదాస్, భార్య, గ్రామస్థులు బాక్యా, బిక్య, గణ్య, రాజేందర్, జీవుల, సర్వన్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం రాయకులు తదితరులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నూతన లేబర్ కోడ్లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ వెల్దుర్తిలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వాణిజ్య, వ్యాపార దుకాణాలను ఇబ్బందిచేశారు. ప్రజావ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి స్థానిక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌తోపాటు సిబ్బంది తాజాదిన్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌరి, వెంకటేశం, లక్ష్మణ్, బాబు, మహేష్, సురేష్, ఆనంద్, పోచమ్మ, యాదయ్య, పెంటయ్యలతోపాటు గ్రామ పంచాయతీ కార్మికులు, హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో ప్రారంభమైన జాతీయసదస్సు

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎరిస్ 2026 జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది, రెండురోజులపాటు జరగనున్న ఈసదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, యువశాస్త్రవేత్తలు పాల్గొని సరికొత్త పరిశోధనలను పంచుకోనున్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేట్‌డైరెక్టర్ డిఆర్‌డిఎల్ హైదరాబాద్ ఆర్.కృష్ణమోహన్‌రావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బివిఆర్ఐటి ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, విభాగాధిపతి మృణాలిని శశాంక, అధిపతులు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బాపిరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేయాలి

-ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య



రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలు నశించాలంటూ అదేవిధంగా ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె సందర్భంగా చిల్డ్రన్స్ పార్క్ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. అడివయ్య మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బిఎస్పి పార్టీ నాయకులు జనార్ధన్‌గౌడ్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అంగనివాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ, నాయకులు నర్సింలు, షకూర్, లింగం, చెంద్రయ్య, నాగరాణి, రాములు, రుబ్లీ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకు పోరాటాలు ఆగవు



నిరసన చేపడుతున్న కార్మికులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకు పోరాటాలు ఆగవు అని ఎఐటియుసి జిల్లా ఉపకార్యదర్శి చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దుచేయకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మంగలి నర్సింలు, సిఐటియు డివిజన్ బాధ్యులు రమేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు నాగేశ్వరి, స్వరూప, ఆశావర్కర్ లక్ష్మి, ఎలిషా, గ్రామపంచాయతీ బాలయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వామి దయానంద సరస్వతి ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

- బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
భారత సమాజాన్ని అజ్ఞానం నుండి విముక్తి చేసి, జ్ఞానమార్గంలో నడిపించిన మహానుభావుడు స్వామి దయానందసరస్వతి అని హర్యాన మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం రామ్‌నగర్‌లో ఆర్యసమాజ స్థాపకులు, మహోన్నత సంఘసంస్కర్త స్వామి దయానందసరస్వతి 202వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ స్వామిజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. వేదాలవైపు తిరిగిచూడండి అనే పిలుపుతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపారని, మహిళా విద్య, సామాజిక సమానత్వం, జాతీయచైతన్యం కోసం ఆయనచేసిన కృషి చిరస్మరణీయమైనదని కొనియాడారు. దేశభక్తి, ధర్మం, నైతిక విలువలను ప్రజల్లో నాటిన స్వామిజీ ఆశయాలను నేటి యువత ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. స్వామి దయానంద సరస్వతి జీవితం మనందరికీ ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్యసమాజ ప్రతినిధులు, ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శంకర నారాయణ పన్ దిరి సంపుటి ఆవిష్కరణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
ప్రముఖ జర్నలిస్ట్ హాస్యావధాని శంకరనారాయణ రచించిన పన్‌దిరి సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో అధ్యక్షుడు కళా విఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. శంకర నారాయణ హాస్యాన్ని జోడించి రాజకీయాలు సామాజిక అంశాలపై సున్నితంగానే ఆలోచించే రీతిలో రాస్తారు అని చెప్పారు. ఆయన గతంలో రాసిన ఫన్‌పరాగ్, పన్‌ఛామృతం వంటి రచనలలో వ్యంగ్యం, అధిక్షేపం కలసి చదివించే గుణంతో ఉంటాయి అని వివరించారు. ఆయన ప్రముఖ దిన పత్రికలో కాలమిస్ట్‌గా కొన్ని సంవత్సరాలుగా ప్రతిభావంత వ్యాసాలు రాస్తున్నారు అని అభినందించారు. పాటలరచయిత స్వరకర్త రాయారావు విశ్వేశ్వరరావు సంపుటిని సమీక్ష చేస్తూ విసుగు ఒత్తిడి తగ్గించేందుకు పన్‌దిరి మంచి టానిక్ అన్నారు. వందశాతం నవ్వును ఈ సంపుటి గ్యారెంటీగా అందిస్తుంది అని తప్పక చదవండి అని సూచన చేశారు. శంకరనారాయణ మాట్లాడుతూ పత్రికల్లో తను రాసిన అంశాలు తదుపరికాలంలో హాస్యావధానానికి ఉపయోగపడ్డాయి అని తెలిపారు. త్యాగరాయ గానసభ తనకు కళాభూమి అని చెప్పారు. గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి వందన సమర్పణ చేశారు.

## ప్రజలపై బిల్లుల బారాన్ని తగ్గించాలి : నాయకులు

- మంచినీటి బిల్లుల విషయంపై సిఎంను కలుద్దాం

**నార్సింగి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల ప్రజలపై జల మండలి అధికారులు మంచినీటి బిల్లుల భారాన్ని తగ్గించాలని బిజెపి, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మణికొండలో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ప్రజలపై వేసిన నీటిబిల్లుల భారంపై ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లడుతూ జల మండలి అధికారులు ప్రజలకు మెరుగైన నీటి సరఫరా చేయడంను మరిచి ఐదేళ్ల కాలంకు సంబంధించిన బిల్లులు ఒకేసారి చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. అరకొర నీటిని సరఫరా చేసి ఇప్పుడు మొత్తం బిల్లులు కట్టాలని, లేని ఎడల నీటి కనెక్షన్లు తొలగిస్తామని ప్రజలను దబాయించడం అన్యాయమన్నారు. జలమండలి అధికారులు ప్రజలకు ఏ నెల ఎంత నీటిని సరఫరా చేశారో సరైన లెక్కా పత్రం లేకుండా, ఒకేసారి వేల రూపాయలు చెల్లించాలని ఆదేశించడం సరైంది కాదన్నారు.

## ఆవంచలో మహిళాసంఘం భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచి స్రవంతికరుణాకర్ తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని ఆవంచగ్రామంలో రూ.10లక్షలతో నిర్మించనున్న మహిళాసంఘం భవననిర్మాణానికి గురువారం సర్పంచి స్రవంతి కరుణాకర్ చేతులమీదుగా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కిష్టయ్య, వార్డుసభ్యులు గండెమ్మ, కరీం, ప్రభుదాస్, నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశం, మహిళాసంఘం సిఎ మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు రోల్‌మాడల్‌పై అవగాహన

**వెల్దుర్తి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు రోల్‌మోడల్, ప్రేరణ తరగతులను ఎన్.రమేష్‌చే చెప్పించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, చార్లెస్, అమూల్య, జయసుధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో చేతికందేలా విద్యుత్ తీగలు

-పట్టించుకోని అధికారులు



పొలంలో వేలాడుతున్న తీగలను చూపిస్తున్న రైతు

**చేర్యాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండలంలోని ఆకునూరు గ్రామంలోని తోకలగట్టు మల్లయ్య, తోకల కొమురయ్య, దొండకాయల కిష్టయ్య, అబ్బు ప్రభాకర్, మండేపల్లి సారయ్యల పొలాల్లో విద్యుత్ తీగలు చేతికందేలా ఉన్నాయని రైతులు ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోయేటట్లు ఉన్నాయని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు.

## నియోజకవర్గంలో 'సమస్యలపై సమరం'

-మన్నె గోవర్ధన్‌రెడ్డి

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్ నియోజకవర్గంలో సమస్యలపై సమరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఆరు డివిజన్లలో సమస్యలతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో పారిశుద్య నిర్వహణ, బస్తీ దవాఖానాల బలోపేతం తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ ఉండేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ప్రభుత్వంలో నియోజకవర్గంలో పారిశుద్యం పడకేసిందని, చెత్త తరలించడానికి రోజుల సమయం పడుతుందన్నారు. ఎక్కడ చెత్త అక్కడే నిలువ ఉంటుందని, ఫలితంగా రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. ఇక వీధిదీపాల సమస్య నెలలు గడుస్తున్నా తీరడం లేదన్నారు. వీధిదీపాలు వెలగడం లేదని, ఫిర్యాదుచేసినా పట్టించుకొనేనాధుడే కరువయ్యాడన్నారు. బస్తీ దవాఖానాలను నిర్వీర్యం చేస్తున్నారని, ఏ కేంద్రంలో సరైన మందులు లేవని, పరీక్షలు సరిగా చేయడం లేదన్నారు. దీంతో పేదలు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని సోమాజీగూడ, వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయన్నారు. మేయర్ ఇదే నియోజకవర్గంలో ఉన్నప్పటికి ఏ డివిజన్‌లోనూ కనీస అభివృద్ధిలేదన్నారు. దారులన్నీతవ్వి అలానే వదిలివేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై సమరం కొనసాగుతుందని, సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళనను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఫిల్మ్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నరసింహా, గజ్జల ఆనంద్, ఎస్కే అహ్మద్, కతాల్, వెంకీ ముదిరాజ్, శ్రీకాంత్, శౌరిరాజు, శ్రీనివాస్, అంజన్ కుమార్, న్యాయవాది నరసింహా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

-సైబరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేసే వరకు పోరాటం

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలి

- రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

**అత్తాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేసి అస్తిత్వాన్ని దెబ్బతిస్తుందని రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో తమ ప్రాంతానికి అన్యాయంచేస్తే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలుడివిజన్‌లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనంచేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వ్యతిరేకిస్తూ గురువారం అత్తాపూర్‌లో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అతిధిగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని పలు జిహెచ్ఎంసి సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గానికి తీవ్రనష్టం జరుగుతుందని పేర్కొన్నారు. మాప్రజలు కట్టే పన్నులను తీసుకుపోయి హైదరాబాదులోని ఎంఐఎంకు కట్టపెట్టే ప్రయత్నంచేస్తుందని, నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.

## విజయవంతంగా దేశవ్యాప్త సమ్మె

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసహరించుకోవాలని నిరసిస్తూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మె నగరంలో విజయవంతం ముగిసింది. సమ్మెలో పలు కార్మిక సంఘాలు పెద్ద పాల్గొని ర్యాలీలు, నిరసనలు తెలిపారు.

## రసరంజని మహాపురుషుడు మండలి నాటకం

: తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ప్రముఖ గాంధీయవాది, రాజకీయ దురంధరుడు, సామాజిక కార్యకర్త, పార్లమెంటు సభ్యుడు, సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతిని పురస్కరించుకొని భారతదేశ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన విశేష సేవలను గుర్తుచేస్తూ రసరంజని హైదరాబాద్ నిర్వహణలో మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి గురువారం తెలిపారు. ఈమేరకు ఆయన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలను మీడియాకు వెల్లడించారు. డాక్టర్ కె.వి.రమణాచారి ఆధ్వర్యంలో ఈ నెల 18 బుధవారం రాత్రి 6గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ సాహితీవేత్త, ఏపి సాంస్కృతికశాఖ మాజీ డైరెక్టర్ డా. దీర్ఘాసి విజయభాస్కర్ రచన, గంగోత్రి సాయి దర్శకత్వంలో డా. బి.జయప్రకాష్ నాటక పరిచయంలో అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి సమర్పణలో మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శింపబడుతుందని పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల నటులు ఎం.వి.రాజర్షి, జి.వసంత యామిని, గంగోత్రిసాయి, ఎం.రాధ, కె.మధుకర్, బడుగు మోహన్‌రావు, లుక్కా సోమేష్, బివి బివి.రాయుడు, వివి.స్వామి, జివి.రంగారెడ్డి, సూర్యదేవర జగన్నాథ రావు, డా. బి.జయప్రకాష్, వివి.నరసింహారావు, గాదె నాగభూషణం తదితరులు నటిస్తున్న ఈ నాటక ప్రదర్శనకు అధికసంఖ్యలో నాటకప్రియులు, మండలి అభిమానులు, రాజకీయవేత్తలు, ఔత్సాహిక ప్రేక్షకులు, యువత విచ్చేసి ఆసాంతం దర్శించి స్ఫూర్తిని పొందాలని డా. కె.వి.రమణాచారి సూచించారు.

## బాధితులు ఆందోళనలు చెందరాదు

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్‌నేషనల్ ట్రస్ట్ వల్ల మోసపోయిన 4,200 మంది బాధితులకు కోర్టు తీర్పు రాలేదని, పోలీస్ ఉన్నతాధికారులు బదలీ అయ్యారని ఎవరూ ఆందోళనలు చెందరాదని, ఆత్మహత్యలకు పాల్పడరాదని ఫౌండేషన్ విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ విజ్ఞప్తి చేశారు. ధన్వంతరి ఫౌండేషన్ కేసు రాష్ట్ర హైకోర్టులో కొనసాగి తీర్పు రిజర్వు చేయడం జరిగిందని, త్వరలోనే న్యాయ బద్దంగా తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్‌కు సంబంధించిన కేసును సిసిఎస్ పోలీసు అధికారులు డిసిపి, ఎసిపిలు చాలా చాకచక్యంగా ఛేదించి బాధితులకు న్యాయం జరిగేలా కోర్టులో అన్ని ఆధారాలను సమర్పించడం జరిగిందని, దీంతో హైకోర్టు ఈ కేసు తీర్పును రిజర్వు చేశారని, తీర్పు ఈ నెల 10వ తేదీన వెలువడవలసి ఉందని, కాని కొన్ని కారణాల వల్ల రాలేదని, త్వరలోనే బాధితులకు న్యాయం జరిగేలా తీర్పు వస్తుందన్నారు. మరొక వైపు ఈ కేసును ఛేదించిన పోలీసు ఉన్నతాధికారులు డిసిపి, ఎసిపిలు సిసిఎస్ నుంచి బదిలీ అయ్యారని బాధితులు మధనపడుతూ ఆందోళన చెందుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధితులు ఎవరూ ఆందోళనలు చెందవద్దని, హైకోర్టు తీర్పు బాధితులకు అనుకూలం వస్తుందని ఆయన చెప్పారు. కాగా ఇటీవల సీతామహాలక్ష్మి అనే వృద్ధురాలు తీవ్రంగా ఆందోళనలు చెంది మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బాధితులు, ట్రస్ట్ ప్రతినిధులు రవి కుమార్, రమణమూర్తి, పద్మజా, రాఘవశర్మ పాల్గొన్నారు.

## 14, 15 తేదీలలో సమాజ్ ఆధ్వర్యంలో సదస్సు

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** సజ్జన్ సమాజ్ ఇంటర్‌నేషనల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నైతికత, మానవత్వం, ఐక్యత కోసం సభ్యుల, శ్రేయోభిలాషుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సమాజ్ వ్యవస్థాపకులు ముస్తాఫా అహ్మద్ అభిలాష, డైరెక్టర్ మసూద్ ఆలీఖాన్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 14వ తేదీన తమ సమాజ్ సభ్యుల సమావేశం జరుగుతుందని, 15వ తేదీన 'వసుదైవ కుటుంబం' అనే అంశంపై సదస్సు కొనసాగుతుందని, ఈ సదస్సులో ప్రముఖులు మల్లవరపు బాలలతా, రమణ మూర్తి, బిఆర్ షాఫి, డా.మసూద్ ఇక్బాల్‌జర్గర్, బి.కె.ఉమారాణి, సయ్యద్ సలార్, ప్రొఫెసర్ ఎం.రాజ్‌కుమార్, బి.ప్రశాంత్, జవహర్, పి.వీరబాబు తదితరులు పాల్గొంటారని వివరించారు.

## బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : సంతోష్ గౌడ్

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**
బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్ తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కార్వాన్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు రావడంతో గురువారం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ గౌడ్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంతో పాటు లంగర్ హౌస్ డివిజన్ లోని పలు బస్తీలు, కాలనీలలో నెలకొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలు ఏవైనా తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు ప్రజా ప్రతినిధుల దగ్గరికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. లంగర్ హౌస్ డివిజన్ లో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట లబ్ధిదారులు జ్యోతి, ఫాతిమా బేగంలు ఉన్నారు.

## సెల్‌ఫోన్ స్నాచింగ్ నిందితుడి అరెస్ట్ ..నగదు స్వాధీనం

**గోషామహల్,ఫిబ్రవరి 12ప్రభాతవార్త:** గత కొంత కాలంగా సెల్‌ఫోన్ల దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు కుల్సుంపురా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుడు నుండి సెల్‌ఫోన్లతోపాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డి.సి.పిజి.చంద్రమోహన్ తెలిపారు.పాత బస్తీ భవానీనగర్‌కు చెందిన సయ్యద్ పక్రూ అలియాస్ అర్బాజ్(23) బహుదూర్‌పురాలో పాత టైర్ల షాపులో పనిచేస్తున్నట్లు తెలిపారు.ఇతనిపై గతంలో భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం,ఆయుధాల చట్టం కింద కేసులు నమోదై ఉన్నట్లు చెప్పారు.గత ఏడాది డిసెంబర్ 16న ఫిర్యాదు దారుడు తన స్నేహితులతో కలిసి జియాగూడలోని పీలామండపం వద్ద మాట్లాడుతుండగా,నిందితుడు అర్బాజ్ తన స్నేహితుడు ఇంతియాజ్‌తో కలిసిహోండా యాక్టివాపై అక్కడకు చేరుకున్నట్లు తెలిపారు.ఫోన్ వాడుతున్న బాధితుడిని గమనించిననిందితులు ,వేగంగా వాహనాన్ని దగ్గరకు తీసువెళ్లి చేతిలోనని ఫోన్ లాక్కుని పరారయ్యారు.ఆ ఫోన్‌ను విక్రయించగా వచ్చిన డబ్బులో అర్బాజ్ తన వాటాగా 2500రూపాయలు తీసుకున్నాడు. పోలీసుల దర్యాప్తు ఈకేసులో ఇప్పటికే మొహమ్మద్ ఇంతియాజ్ ఎలియాస్ షూటర్ షేక్ హాజీలుజైల్‌లో ఉండగా,పరారీలో ఉన్న అర్బాజ్‌ను క్రైం టిమ్ నిన్న పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుండ రెండు వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడి కలీమ్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కేసును చేధించి నిందితుడిని అరెస్ట్ చేసిన కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు,డిటెక్టవ్ ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున,క్రైమ్ టీమ్‌ను డి.సి.పి.చంద్రమోహన్ అభినందించారు.ఈ కేసును అడిషనల్ డి.సి.పి కృష్ణగౌడ్,గోషామహల్ ఏ.సి.పి సుదర్శన్ పర్యవేక్షణలో కొనసాగిందన్నారు.

## విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన "సంక్షేమ డైరీ- 2026" ఆవిష్కరణ గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు శ్యాం మనోహర్, సెక్రటరీ జనరల్ మేడి రమేష్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా మంత్రిని సంఘం ప్రతినిధుల బృందం ఘనంగా సన్మానించగా అనంతరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి అడ్లూరి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమంకోసం సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. సంక్షేమ మంత్రిగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రాజ్యాంగబద్ధ హక్కులకోసం తన శక్తివంచనలేకుండా పనిచేస్తానని అన్నారు. ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని అన్నారు.


వినత పత్రం అందజేస్తున్న దృశ్యం

## ఆశావర్కర్‌ను నియమించాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామానికి నూతన ఆశావర్కర్‌ను నియమించాలని సర్పంచ్ బిగుళ్ల మోహన్ గురువారం బెజ్జంకి పిహెచ్‌సిలో డాక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిగుళ్ల మోహన్ మాట్లాడుతూ కల్లేపల్లి గ్రామానికి గతంలో జనాభా ప్రాతిపదికన ఇద్దరు ఆశావర్కర్లను నియమించారని తెలిపారు. రెండేళ్ల క్రితం ఒక ఆశావర్కర్ శాంతకుమారి మృతి చెందగా అప్పటి నుంచి కల్లేపల్లి మదిర ప్రాంతాలైన ఇట్టిరెడ్డిపల్లి, గుంటూరుపల్లి కలిపి సుమారు 3 వేల పైచిలుకు జనాభాకు ఒక్కరే ఉండడంవల్ల తీవ్రమైన పని భారంపడుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి కలేపల్లికి ఆశా వర్కర్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శశివినీత్, వార్డు సభ్యులు ఒగ్గు కనకయ్య, అనిల్‌కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికి పజాస్వామ్యంపై అవగాహన ఉండాలి

కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య


మాక్ పోలింగ్‌లో స్పీకర్‌కు సమస్యలను వివరిస్తున్న విద్యార్థులు

**కొండపాక, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థికి ప్రజాస్వామ్యంపై అవగాహన ఉండాలని కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పార్లమెంట్‌లో పరిపాలన ఏ విధంగా ఉంటుందో అవగాహన కల్పించారు. పార్లమెంట్ స్పీకర్‌గా హరిప్రియా వ్యవహరించగా, ప్రధానమంత్రిగా, ప్రతిపక్ష నాయకులుగా విద్యార్థులు వ్యవహరించారు. పలు సమస్యలను స్పీకర్‌కు వివరిస్తున్నట్లు చూపించారు. ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాజయ్య, సాజిత్, కొండి మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, హేమలత పర్యవేక్షించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు కార్యక్రమంలో తెలుసుకున్న అనుభవాలను వివరించారు.

## నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌నర్సయ్య


కొండపాక నుండి సార్వత్రిక సమ్మెకు బయలుదేరిన కార్మికులు

**కొండపాక ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** దేశవాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని సమీకృత కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి బైక్ ర్యాలీతో రవీంద్రనగర్ నుండి సిద్దిపేటలో నిర్వహించే భారీ ప్రదర్శనకు బయలుదేరారు. ఈ సందర్భంగా సిఐటియూ జాల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని, జాతీయ విత్తన విధానాన్ని రద్దు చేయాలని, 2025 విద్యుత్ చట్టన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బర్మ కొమురయ్య, తాటోజు రవీద్రచారి, నర్ర ప్రతాప్‌రెడ్డి, అరుట్ల నరసయ్య, జాలిగామ ప్రభాకర్, శంకర్, కిష్టయ్య, అనిల్, రాజు, వివిధ సంఘాల నాయకులు, కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు.

### అబాకస్ పోటీల్లో సత్తాచాటిన సెయింట్ జోసెఫ్స్ విద్యార్థులు

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో హుస్నాబాద్‌లోని సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో, సెయింట్ జోసెఫ్స్ విద్యార్థులు తమ వేగం, ఖచ్చితత్వం, మానసిక గణిత నైపుణ్యాలతో అందరి దృష్టిని ఆకర్షించారు. వివిధ విభాగాల్లో కె. సుప్రతిక్, బి.సాత్విక్, ఎస్.ప్రణీత బహుమతులు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అలాగే మరికొందరు విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు అందుకుని పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారని ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు


హుండీలు లెక్కిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ హుండీలను గురువారం ఆలయంలో లెక్కించారు. 21 రోజుల హుండీ ఆదాయం రూ.90,42,186 నగదు, 47 గ్రాముల మిశ్రమ బంగారం, 005 కిలోల మిశ్రమ వెండి వచ్చినట్లు ఆలయ ఈవో వెంకటేశం తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్స్‌పెక్టర్ పి.విజయలక్ష్మీ, సహాయ కార్యనిర్వహణాధికారి బుద్ది శ్రీనివాస్, ఆర్.సుదర్శన్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఉత్సవ కమిటీ సభ్యులు గంగ నర్సింహ్మారెడ్డి, సార్ల లింగం, ఎల్లయ్య, మల్లేశం, వంగరి వరలక్ష్మీనాగరాజు, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్వర్ణకారుడు నర్సించారి, ఎస్‌బిఐ సిబ్బంది శివరామకృష్ణ భజన మండలి సేవ సమితి సేవ సభ్యులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ సెక్రెటరీ తిరుపతిని కలిసిన సంతోష్

**చేర్యాల, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ సెక్రెటరీ రేండ్ల తిరుపతిని జనగామ జిల్లా డీసీసీ మెడికల్, హెల్త్‌వింగ్ చైర్మన్ డాక్టర్ ఎడెల్లి సంతోష్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.


అసెంబ్లీ సెక్రెటరీ తిరుపతిని కలిసిన డాక్టర్ ఎడెల్లి సంతోష్ కుమార్

# నేడే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

**భయాందోళనలో కౌన్సిలర్ అభ్యర్థులు...! మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిని వరించనుందో..?**


హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్న నేపథ్యంలో పట్టణం మొత్తం ఉత్కంఠతో ఎదురు చూస్తోంది. ముఖ్యంగా కౌన్సిలర్ అభ్యర్థుల్లో భయాందోళన వాతావరణం నెలకొనగా, ఫలితాలపై రాజకీయ లెక్కలు మారుమోగుతున్నాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులకుగాను 92 మంది అభ్యర్థులు బరిలోకి దిగగా, ఒక్కో అభ్యర్థి గెలుపు కోసం రూ.10 లక్షల నుంచి రూ.25-30 లక్షల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే సంకల్పంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ నాయకులు ఓటర్లను మభ్యపెట్టేందుకు ఇంటింటికి చికెన్, మటన్, బిర్యాని ప్యాకెట్లు, డబ్బుల ప్రలోభాలకు గురిచేయడం, ప్రచార హడావుడితో ఈ ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా మారాయన్న విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్యే నువ్వా నేనా అన్నట్లు పోటాపోటీగా కొనసాగింది. మున్సిపల్ ఎన్నికలను ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ ఇద్దరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం చివరి క్షణం వరకూ హోరాహోరీగా సాగింది. ఫలితాలతో పాటు మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరి ఖాతాలోకి వెళ్లనుందన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. స్పష్టమైన మెజార్టీదక్కుతుందా లేక హంగ్ కౌన్సిల్ ఏర్పడి రాజకీయ సమీకరణాలు మారతాయా అన్న చర్చ పట్టణమంతా నడుస్తోంది. కోట్ల రూపాయల ఖర్చుతో సాగిన ఈఎన్నికల్లో ఓటర్లు ఎవరికీ తీర్పు ఇచ్చారన్నది, ఎవరి రాజకీయభవితవ్యానికి బ్రేక్ పడుతుందో, ఎవరికీ ఊపువస్తుందో కొద్దిగంటల్లోనే తేలనుంది.

# పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**


మాట్లాడుతున్న చుక్క రాములు

**చౌటకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంద్రంలోని నరేంద్ర మోది ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ధ్వజమెత్తారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మండల పరిధిలోని శివంపేట బీరు పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో చుక్క రాములు పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓట్లేసుకుని అధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారుల పక్షాన కార్మికులపై దాడిచేస్తున్నారని ఆరోపించారు. 4 లేబర్ కోడ్ చట్టాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యజమానికి అవసరం ఉంటేనే కార్మికులను పనిలో పెట్టుకుంటారని, అవసరం లేకుంటే తొలగించేలా చట్టాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**మోటార్ బైక్ ర్యాలీ...**

శివంపేటలోని బీరు పరిశ్రమ నుంచి సంగారెడ్డికి మోటారరు బైకులపై ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని చార్మినారర్ బీరు పరిశ్రమ, చౌటకూరులోని ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ, ఎస్ఇటిక్యాలలోని ఎంఎస్ ఇండస్ట్రీస్ కార్మికులు పాల్గొనడంలో ఆయా కర్మాగారాల్లో గురువారం ఉత్పత్తులు నిలిచిపోయాయి. కార్యక్రమంలో బీరు పరిశ్రమలో సీఐటియు గౌరవ అధ్యక్షులు బాగారెడ్డి, నాయకులు ప్రసన్నరావు, విష్ణువర్ధన్ గౌడ్, మల్లారెడ్డి, ఎం విఠల్, చంద్రయ్య, ఏర్పుల నాగభూషణం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


తీగుల్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

## ఆదర్శ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తా

-తీగుల్ గ్రామ సర్పంచ్ రజిత పరశురాం

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** తీగుల్ గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ కుడుదుల రజిత పరశురాం అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను గ్రామస్తులు సభ దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా విడతల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్‌బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, ఎల్లయ్య, బిక్షపతి, రాంప్రసాద్‌రావు, పంచాయతీ కార్యదర్శి నరేందర్, వార్డు సభ్యులు ఆంజనేయులు, మల్లేశం, లక్ష్మినర్సింలు, అశ్విని కరుణాకర్‌రెడ్డి, రాధ, పద్మ, రాజు, అశోక్, వెంకటేష్, నాయకులు దయానందరెడ్డి, భూమయ్య, అశోక్, ఎల్లారెడ్డి, అంజిరెడ్డి, వెంకటేష్, ఐలయ్య, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నవోదయలో ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుపై అవగాహన

**వర్గల్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్‌లో గురువారం ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుపై విద్యార్థులకు హైద్రాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన యుఆర్ఎస్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ నిర్వాహకులు అరవింద్ సోని, ఊర్వశి సోనిలు అవగాహన కల్పించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా 12వ తరగతి తర్వాత విద్యార్థులు ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో ఏ విధంగా అడ్మిషన్ పొందాలి, ఫ్యాషన్ టెక్నాలజీలో ఉన్న విస్తృత అవకాశాల గురించి సవివరంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన ఆలమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ నాయక్, నిరూప పాటిల్‌లకు విద్యాలయ ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల్‌లక్ష్మి

## కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

-సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల్‌లక్ష్మి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి బాల్‌లక్ష్మి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్‌లో గ్రామపంచాయతీ కార్మికులు, వివోఏలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి ఎంపిడివో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను మోసం చేసే నూతన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ప్రధాని మోడి ప్రభుత్వం తీసుకువిచ్చ కోడ్‌లు కార్మికుల కుటుంబాల్లో చిచ్చుపెట్టే విధంగా ఉన్నాయన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా, పని గంటలు 12 గంటలకు పెంచి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. కార్మికుల కుటుంబాలకు రక్షణగా ఉన్న ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు, చట్టాలు ఉన్నప్పటికీ అమలు జరగడంలేదని, భవిష్యత్తులో కార్మికుల జీవితం ప్రశ్నార్థకంగా ఉంటుందన్నారు. 1970 కాంట్రాక్ట్ లేబర్ చట్టం పోయిందని, దీంతో యజమానికి కాంట్రాక్ట్ కార్మికుల మధ్య సంబంధాలు తెగిపోయాయని, కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు, అసౌకర్యాలు జరిగినప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీ, గ్రామపంచాయతీ, ఆశా వర్కర్లకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, ఐకెపి వివోఏలకు గౌరవ వేతనం నెలకు రూ.26వేలు అందించి వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లోకుల నర్సింలు, లింగారి యాదగిరి, బిక్షపతిరెడ్డి, స్వాతి, కృష్ణారెడ్డి, శివదాస్, కనకవ్వ, రవి, బాలమ్మ, అనిల్, జానకి, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

### గౌసేపాక్ దర్గాలో ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని రాణిగంజ్ సిటీలైట్ చౌరస్తా వద్ద ఉన్న గౌసేపాక్ దర్గాలో గురువారం గ్యార్వీ షరీఫ్ ఫాతిమాను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రార్ధనల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్,నిర్వహకులు జావీద్,సలీం, శివ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కిషోర్ కుమార్, ఆంజనేయులు, సతీష్, గణేష్, సూరి, అబ్బి, శివ, వినయ్, శ్రీనివాస్, సెల్వీరాజు, జనార్ధన్‌రాజు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మొండివైఖరి నిరసిస్తూ కార్మికుల భారీ ర్యాలీ

**బెజ్జంకి/తొగుట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు, సిపిఎం, సిఐటియునాయకుల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి 4 లేబర్‌కోడ్ల పేరుతో కార్మికుల మెడకు ఉరితాళ్లు బిగిస్తుందన్నారు. సామాన్య ప్రజలను విస్మరించి సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని గిట్టుబాటు ధర రైతు హక్కు అన్నారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెతోనైనా మోడీ సర్కార్ కళ్లు తెరిచి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సాయికృష్ణ, ఎల్లయ్య, బోనగిరి లక్ష్మణ్, కోరేపు శివకుమార్, రవి, బోనగిరి లింగం, సత్తయ్య, శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**తొగుటలో...**

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా తొగుటలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని విద్యుత్ సవరణ చట్టం 2025, వీబీజీ రాంజీ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర సర్కార్ కార్మికులను కబానిసలుగా చేస్తుందన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభు త్వం స్వస్తి చెప్పాలని లేనట్లయితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రవీణ్, వసంత, శ్యామల, స్వప్న, వారమ్మ, దేవమ్మ, భాగ్యలక్ష్మీ, హేమలత, సాబేర, లావణ్య, మాణిక్యం, నరసింహులు, మల్లేశం, మౌనిక పాల్గొన్నారు.


బెజ్జంకిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తొగుటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## జాతీయ సమ్మె విజయవంతం

సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి

**చేర్యాల, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి గురువారం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, నూతనంగా ప్రవేశ పెట్టిన 4లేబర్ కోడ్స్‌లను రద్దుచేసి, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే 8 గంటల పని విధానం అమలుచేయాలని ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ జిబిజి రామ్ జి చట్టాన్ని,జాతీయ విత్తన,విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మికుల,ప్రజా వ్యతిరేక విధానాలపట్ల ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. సమ్మెలో చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, చుంచనకోట సర్పంచ్ గొర్రె శ్రీనివాస్‌లు కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొని మాట్లాడారు.సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు ఒర్గల్ వేంకటవ్వ, తాదురి సౌభాగ్య లక్ష్మీ, కొలిపాక యాదవ్వ, పోలోజు పద్మ, తాదురి నర్సింలు, రజితపద్మ, గ్రామ పంచాయతీ వర్కర్స్ బాల్‌నర్సయ్య, బిక్షపతి, లింగయ్య, అంగన్‌వాడీనాయకులు వర్కర్స్ హెల్పర్స్ సుజాత, రాజేశ్వరి, వెంకటలక్ష్మీ, చంద్రకళ, చంద్రం, మంతపూరి జ్యోతి, మల్లీశ్వరి, యాదమ్మ, కిసరి కవిత, బండకింది శ్రీలత, లక్ష్మీ, తేజ, పర్శరాములు, పద్మ, నర్సింలు, లత, సుకన్య, రజిత పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

**చేర్యాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని జనగామ నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కడవేర్గు గ్రామంలో 5వ వార్డు మెంబర్ అస్రాఫ్ బాబా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని ప్రారంభించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్ళపల్లి రమేష్,వార్డు సభ్యులు,భాగోతం రామచంద్రం, పూర్మ ఆగంరెడ్డి,మంజ మల్లేశం,మహదేవుని శ్రీనివాస్,భాస్కర్‌రెడ్డి,పాల లక్ష్మీనారాయణ,రంగు శంకర్,వినీత్ తదితరులు పాల్గొన్నారు.

### బారికేడ్లు తొలగింపు... ప్రమాదంలో విద్యార్థులు

**కోహెడ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కేరళ పాఠశాల యాజమాన్యం తీరుపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ముందు విద్యార్థుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను యాజమాన్యం పక్కన పెట్టడం సరికాదని మండిపడుతున్నారు. కోహెడ నుంచి హుస్నాబాద్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిరంతరం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాఠశాల సమయాల్లో భారీ వాహనాలు,ఆర్టీసి బస్సులు వేగంగా వెళ్తుంటాయి. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు గతంలో బారికేడ్లు ఏర్పాటుచేశారు. అయితే పాఠశాల యాజమాన్యం వాటిని పక్కకు తొలగించడంతో వాహనాలు వేగంగావెళ్తూ విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై బారికేడ్లు లేకపోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే స్పందించి పాఠశాలముందు తిరిగి బారికేడ్లు ఏర్పాటు చేయడమేకాకుండా స్కూల్ జోన్ సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. బారికేడ్లు తొలగించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**బెజ్జంకి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మండలంలో అనుమతి లేకుండా విగ్రహాలు కానీ గద్దెలు నిర్మించడానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఏర్పాటు చేయరాదని ఎస్ఐ బి.సౌజన్య సూచించారు.గురువారం ఆమె మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ సౌజన్య తెలిపారు.

### ములుగులో కార్మికుల నిరసన ర్యాలీ


ములుగులో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

**ములుగు, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ములుగులో కార్మికులు పెద్దసంఖ్యలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుండి ర్యాలీగా రాజీవ్ రహదారిపైకి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులందరికీ రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్స్ రద్దు చేయాలని అన్నారు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎర్రోళ్ల మల్లేష్, వివోఏల మండల అధ్యక్షుడు ఎల్ల స్వామి, పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు నాగేష్, అంగన్వాడీ గజ్వేల్ ప్రాజెక్ట్ కార్యదర్శి అంజలి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గణేష్‌తో పాటు అంగన్వాడీ, ఐకెపి, భవన నిర్మాణ, పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### టేకూర్‌లో ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని టేకూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణానికి గురువారం సర్పంచ్ ఎంటూరి సంగీత నాగేశ్వర్ కాంగ్రెస్ నాయకులు, గృహ నిర్మాణ శాఖ ఏఈ మహేష్‌లతో కలిసి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రహరి గోడ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు కావడంతో పనులను ప్రారంభించామన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విగ్నేశ్వర్, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### కూడవెల్లి వాగులోకి సాగునీరు విడుదల

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మల్లన్నసాగర్ నుండి కొండపోచమ్మ సాగర్ కెనాల్‌కు పోయే గేట్ నుండి కూడవెల్లి వాగులోకి సాగునీటిని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి గురువారం గజ్వేల్ ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో కొడకండ్ల మాజీ ఎంపిటిసి అంజియాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ముంద్రాతి లక్ష్మి కొండయ్య, కరుణాకర్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అమరేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.


కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసి పూలు చల్లుతున్న నర్సా రెడ్డి

## పుణ్యక్షేత్రాలకు ఆర్టీసి బస్సులు

–ఆర్టీసి డిఎం టి.స్వామి



వనదుర్గాభవానీమాత, కేతకి సంగమేశ్వరస్వామి ఆలయాల దృశ్యం

**జహీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయం, మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయాలకు చేరుకునేందుకు జహీరాబాద్ ఆర్టీసి డిపో నుంచి ఆర్టీసి బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. ఆయాపుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయించి అవస్థలు పడకుండా ఉండేందుకు ఝరాసంగంకు 10, ఏడుపాయలకు 10 ప్రత్యేకబస్సులను ఈ నెల 14వ తారీఖు నుంచి 18వ తారీఖువరకు నడుపుతున్నామన్నారు. భక్తులు ఆర్టీసి కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## న్యాల్‌కల్‌లో ఉపాధిహామీ పనులు ప్రారంభం



ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఉపాధికూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

–కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జారాం




సైబర్‌నేరాలపై అవగాహనకల్పిస్తున్న కెనరాబ్యాంక్ మేనేజర్ తుల్జారాం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ మోసాలకు గురికాకుండా ఉండాల్సిన అవసరం ఉందని మండలంలోని హద్నూర్ గ్రామంలోని కెనరాబ్యాంక్ మేనేజర్ తుల్జారాం అన్నారు. గురువారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో పాలక వర్గం, గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమ సెల్‌ఫోన్‌లకు వచ్చే మెస్సేజ్‌లకు, లింకులకు ఆకర్షితులయితే మోసాలకు గురికాక తప్పదని గుర్తుచేశారు. 60ఏళ్ల లోపు వయసుగలవారు ఏడాదికి 450 రూపాయలు చెల్లిస్తే 2లక్షల ప్రమాదబీమాను అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి మాతంశెట్టి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్, వార్డుసభ్యులు, బిఆర్ఎస్‌నాయకులు షబ్బీర్‌ఖాన్, విజయ్, అశోక్, రాజు, అంబమ్మలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడల్లో బాలికల విజయం



సిఎం కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
జిల్లా స్థాయి సిఎం కప్ క్రీడల్లో మండల బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంతోషికుమారి తెలిపారు. ప్రిన్సిపాల్ కథనం ప్రకారం.. ఎన్.కీర్తనా 600మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానంలో, భూమికా, కీర్తనా 4వందల మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానం, ఎస్.కవిత లాంగ్‌జంప్‌లో, షాట్‌పుట్‌లలో 2వ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంతోషికుమారి వివరించారు.

## చిద్రుప్పలో 10లక్షలతో మహిళాశక్తి భవనం

–భవన నిర్మాణం పనులకు పూజలు చేసిన సర్పంచి శ్రీశైలం



మహిళాశక్తి భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచి శ్రీశైలం

**కంది, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చిద్రుప్ప గ్రామంలో 10లక్షల రూపాయలతో నిర్మించే మహిళాశక్తి భవన నిర్మాణానికి గురువారం గ్రామసర్పంచి కోడూరి శ్రీశైలం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి భవననిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు సర్పంచి పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రఘుగౌడ్, ఉపసర్పంచి సుదర్శన్‌రెడ్డి, వార్డుసభ్యులు శంకరమ్మ, సక్కుబాయిప్రసాద్, ఎపిఎం శివలక్ష్మి, ఏఈఈ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌నాయక్, సిఎ నగేష్, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## హుగ్గెల్లి జడ్పిహెచ్‌ఎస్‌ను సందర్శించిన డిఈఓ

**జహీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని హుగ్గెల్లిగ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను జిల్లావిద్యాధికారి వెంకటేశ్వర్లు, సిఎంఓ వెంకటేశంలు సందర్శించి పాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు సర్పంచి పట్లోళ్ల విమలాశ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయ భవితవ్యం తేలేది నేడే



ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
చరిత్రలో తొలిసారిగా మున్సిపాలిటీ హోదా సాధించిన గుమ్మడిదలలో, రాజకీయ దిశానిర్దేశం చేయనున్న కీలక ఘట్టం సమీపించింది. ప్రజలు తమ ఆశలు, నాయకుల భవిష్యత్తు ఆకాంక్షలు, అభివృద్ధికలల్ని బ్యాలెట్‌బాక్స్‌లో నింపగా, ఆతీర్పు ఏపార్టీకి అనుకూలంగా వస్తుందో అన్న ఆలోచనలతో మున్సిపాలిటీ మొత్తం ఉత్కంఠభరిత వాతా వరణంలో మునిగిపోయింది. ఈనేపథ్యంలో గుమ్మడిదల తొలి మున్సిపాలిటీ ఎన్నికల ఓట్లలెక్కింపును గుమ్మడిదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి దశరథ్ వెల్లడించారు. గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని 22వార్డులకు చెందిన అన్నారం, దోమడుగు, బొంతపల్లి, వీరన్నగూడెం, గుమ్మడిదల వార్డుల నుండి వచ్చిన బ్యాలెట్ బాక్సులను గుమ్మడిదల కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఇనుపతలుపుల మధ్య, తుపాకీగార్డులతో అత్యంతకట్టుదిట్టమైన భద్రతతో జాగ్రత్తపరిచినట్లు తెలిపారు. ఈ ఎన్నికలు కేవలం కౌన్సిలర్ పదవుల పోరాటం మాత్రమేకాక, గుమ్మడిదల మున్సిపాలిటీ రాజకీయ ఆధిపత్యానికి ప్రతీకగామారాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి తోపాటు స్వతంత్ర అభ్యర్థులుకూడా గెలుపు కోసం ఉత్కంఠభరితంగా ఎదురుచూస్తున్నారు. ఎవరికి గెలుపు? ఎవరికి పరాజయం? అన్న ప్రశ్న గుమ్మడిదల గల్లీగల్లీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఫలితాల ప్రకటనతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందన్న అంచనాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే ఈ కీలకఘట్టం, రేపటి రోజున గుమ్మడిదల రాజకీయ చరిత్రలో ఒక మలుపుగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు అంతా అభిప్రాయపడుతున్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

–న్యాల్‌కల్‌లో కార్మికుల భారీ ర్యాలీ



న్యాల్‌కల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు సంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికల హక్కులను కాలరాసేలా చట్టాలను తీసుకువస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## భోజనం బాగా లేదంటూ రోడెక్కిన మినీ గిరిజన హాస్టల్ విద్యార్థులు

–డిఎస్పీ, సిఐ, ఎస్ఐ, రెవిన్యూవారి చొరవతో సద్దుమణిగిన విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండలపరిధిలోగల జుక్కల్ శివారులోని మినీ గురుకులంలో గత కొన్ని రోజుల నుండి మెనూ ప్రకారం భోజనం పెట్టలేదంటూ విద్యార్థులు గురువారం జాతీయ రహదారిపై ధర్నాకుదిగి, ప్లేట్స్ విసిరేస్తూ ఆందోళనకు చేసారు. దీంతో విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ రావుల శ్రీశైలం తమసిబ్బందితోపాటు రెవిన్యూ ఆఫీసర్ విచ్చేసి విద్యార్థులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. విద్యార్థులతో, అక్కడ వున్న ఉపాధ్యాయులతో డిఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడి, ఇప్పటినుండి ఎలాంటి సమస్యలు రాకుండా మీ హాస్టల్ ప్రత్యేక అధికారితో మాట్లాడి సమస్యలు తలెత్తకుండా చూస్తానని విద్యార్థులకు నచ్చచెప్పడంతో విద్యార్థులు ధర్నాను విరమించుకున్నారు.

## జిల్లాస్థాయి సిఎం కప్ విజేత పాపన్నపేట



సిఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ విజేత పాపన్నపేట ఉమెన్స్ జట్టు

**పాపన్నపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
జిల్లాస్థాయి సిఎం కప్‌ను పాపన్నపేట ఉమెన్స్ జట్టు దక్కించుకున్నట్లు పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పిడి రమేష్‌లు వెల్లడించారు. మెదక్ పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి సిఎం కప్ కబడ్డీ పోటీల్లో పాపన్నపేట ఉమెన్స్ జట్టు విజయంసాధించి జిల్లాస్థాయి బహుమతి అందుకుంది. ఆరు నియోజకవర్గాల జట్లు పాల్గొనగా పాపన్నపేట ఉమెన్స్ జట్టు విన్నర్‌గా నిలిచినట్లు హెచ్‌ఎం మహేశ్వర్, పిడి రమేష్ వెల్లడించారు.

## సదాశివపేటలో దేశవ్యాప్త సమ్మె విజయవంతం




సమ్మెలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

**సదాశివపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా మోడీ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని కార్మిక హక్కులను పెట్టుబడుదారులకు చుట్టాలుగా తయారుచేసి పెట్టుబడుదారుల సంక్షేమం కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, కేంద్రప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక ప్రభుత్వమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈరోజు సార్వత్రిక సమ్మెలో భాగంగా సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం 5గంటల నుండి ఎంఆర్ఎఫ్, పెన్నార్, బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ పరిశ్రమల ముందు ఆందోళన నిర్వహించడం జరిగింది. సదాశివపేట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుండి స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీనిర్వహించి బస్టాండ్ దగ్గర రాస్తారోకో మానవహారం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింలు, రాజు, కృష్ణమూర్తి, ఎండి హాజీ, మనోహర్, వెంకటేష్, విన్నర్ పరిశ్రమ యూనియన్ నాయకులు శ్రీనివాస్, మల్లేశం, మూర్తి, నాగరాజు, రవి, బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, జనార్ధన్, రాష్ట్రవ్యాప్త రంగాల కార్మికులు యాదమ్మ, రుక్కమ్మ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న జీవితబీమా కార్మికులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న 4 లేబర్‌కోడ్స్ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జహీరాబాద్ జీవితబీమా కార్మికులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు అశోక్, మానయ్య, అలీం, చంద్రరెడ్డి, సుభాష్, యేసయ్య, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మయ్య, కిష్టన్న, తమ్మన్న, మచ్చేందర్‌లు మాట్లాడుతూ కేంద్రం లేబర్ కోడ్స్‌ను రద్దుచేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కేంద్రం కార్మిక చట్టాలను ఏకీకృతం చేసేందుకు పన్నాగాలు చేయడం మంచిదికాదని అన్నారు. వెంటనే వాటిని ఉపసమరించుకోవాలని వారు డిమాండ్‌చేశారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర సర్కార్



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మండలవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట పట్టణంలో గురువారం నిరసనర్యాలీ నిర్వహించి మెదక్–చేగుంట రహదారిపై నిరసన వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, దేశ సంపదను లూటీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కావేరి సిఐటియు యానియన్ అధ్యక్షులు బాలయ్య, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, నాగేందర్‌రెడ్డి, స్వామి, గణేష్‌రెడ్డి, సంతోష్, ఎల్లం, సిద్దిరాములు, గణేష్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేట అభ్యర్థుల్లో టెన్షన్..నేడే ఓట్ల లెక్కింపు




సదాశివపేట మున్సిపల్ కార్యాలయం

**సదాశివపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
15రోజులుగా తమ గెలుపుకోసం కష్టపడిన అభ్యర్థుల మద్దతుదారులకు ఒకరోజు విరామం లభించింది. ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులలో టెన్షన్ మొదలైంది. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువ వార్డులలో పోటీలో ఉండడం వలన తమ గెలుపును అంచనావేయలేక టెన్షన్ పడుతున్నారు. అందులోనూ స్థానిక సర్వేల ప్రకారం చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి ఏ పార్టీకి కూడా పూర్తి మెజారిటీ రాదన్న ఊహగానాలతో బిజెపి ఇండిపెండెంట్ ఎంఐఎం పార్టీల మద్దతు అవసరం వస్తుందేమోనని ఆదిశగా పావులు కదుపుతున్నారు. చైర్మన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో పలుకుబడి ఉన్న అన్ని కులాల వారు కూడా గెలిస్తే ఆ స్థానాన్ని పొందే దిశగా అడుగులు వేస్తున్నారు. 26వ వార్డు అభ్యర్థులలో సుమారు ఒకటి లేదా రెండు అటు ఇటుగా కాంగ్రెస్‌కు12, టిఆర్ఎస్11, బిజెపి, ఎంఐఎం, ఇండిపెండెంట్ 3 రావచ్చునని అంచనా వేస్తున్నారు. అదేగాని జరిగితే, చిన్న పార్టీల మహిళా అభ్యర్థులు గెలిస్తే, వారు కోరే డిమాండ్ అత్యున్నత స్థానం కూడా అయి ఉండవచ్చు అని అనుకుంటున్నారు. ఏది ఏమైనా కొన్ని గంటల్లో తెలిసే ఎన్నికల ఫలితాల కోసం వేచి చూడాల్సిందే.

## వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–మరియంపూర్ వైద్యశిబిరంలో మండల పశువైద్యాధికారి గణేష్

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
గ్రామాల్లో ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గణేష్ సూచించారు. గురువారం మండలపరిధిలోని మరియంపూర్‌లో జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యశిబిరానికి చేరుకున్న పశువులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స అందచేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి హెచ్. నాగేశ్వరికాశీనాథ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, ఎల్ఎస్ఎ వి. రమేష్, విఎ శ్రీనివాస్, గోపాలమిత్రలు జనార్ధన్‌రెడ్డి, చంద్రయ్య, ధనరాజ్, హుసేని, పాడిరైతులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల ఆందోళన

–రెవిన్యూ సిబ్బందికి వినతి పత్రం



రెవిన్యూ సిబ్బందికి వినతిపత్రం అందచేస్తున్న ఆశావర్కర్లు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని రెవిన్యూ కార్యాలయం ముందు గురువారం ఆశావర్కర్లు ఆందోళనకు దిగారు. తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆశావర్కర్లు డిమాండ్‌చేస్తూ రెవిన్యూ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో కార్మికుల భారీ ర్యాలీ



జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
దేశవ్యాప్తసమ్మెలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ఆయా కర్మాగారాల కార్మికులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పెద్దసంఖ్యలో పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు. కర్మాగార కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెలో సిఐటియు నాయకులు జి.సాయిలు, ఎస్‌జమహిపాల్, మహేంద్ర, పిరామిల్, ఎంజి ముంగి తదితర కర్మాగారాల కార్మికులు, నియోజకవర్గంలోని అంగన్‌వాడీ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బాధ్యతలు ఐసిడిఎస్‌కు అప్పగించాలి

–తహసీల్ ముందు అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె




తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ కేంద్ర పర్యవేక్షణ, బాధ్యత సర్పంచులకు అప్పగించే నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పర్యావరణ బాధ్యతలను ఐసిడిఎస్ అధికారులకు అప్పగించాలని డిమాండ్‌చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె నిర్వహించి తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా సిఐటియు మండల అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా వక్రీకరించి అవమానపడేలాచేస్తూ అవమానించడం సరైందికాదని ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల ఉద్యోగభద్రతకు ముప్పు కలిగించే చర్యలు చేపట్టొద్దని సూచించారు. ఆన్‌లైన్ వ్యవస్థ కొనసాగుతున్న తరుణంలో అంగన్‌వాడీ సరుకులు పక్కదారి ఎలా పడతాయని ప్రశ్నించారు. అంగన్‌వాడీల పర్యవేక్షణ బాధ్యతలు సర్పంచులకు కాకుండా ఐసిడిఎస్ అధికారులకే అప్పగించాలని మంజుల డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కార్మికచట్టాలకు రక్షణ కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రైతుసంఘం నాయకులు

**మునిపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
లేబర్ కోట్లను రద్దుచేసి కార్మిక చట్టాలను రక్షణ కల్పించాలని, విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాతపద్ధతిలోని ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలని, విత్తన సవరణ, విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని, రైతులకు కూలీలకు కార్మికులకు ప్రజలందరికీ రక్షణగా నిలిచే చట్టాలను కొనసాగించాలని కోరుతూ గురువారం దేశవ్యాప్త సమ్మె సందర్భంగా మునిపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అక్కడనుండి ర్యాలీగా సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం, రైతుసంఘం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, అంగన్‌వాడీ యూనియన్, ఆశా యూనియన్‌ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధంచేసి తహసీల్దార్, ఎంపిడివోలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిపల్లి సర్పంచి సౌందర్య నరేందర్‌గౌడ్, ఉపసర్పంచి పాండు, మాజీ ఎంపిటిసి యాదయ్య, నాగేష్‌కుమార్, ఇమ్మానాలి, రవి, విట్టల్‌గౌడ్, సంగీత, మంజుల, భ్రమరాంబ, రాజు, అంజయ్య, చంద్రయ్య, మహేందర్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు

**సదాశివపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**
పట్టణంలోని స్థానిక శ్రీసంగమేశ్వరమందిరం భజన భక్తబృందం ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను 12వ తేదీగురువారం నుండి 15వ తేదీ మహాశివరాత్రి వరకు నిత్యం స్వామివారికి పూజలు జరుగుతాయని ఆలయపూజారులు జి.మోహన్‌రావు, బిఎన్.శంకర్రావు. బిఎన్.నారాయణరావులు గురువారం ఒక ప్రకటనద్వారా తెలియజేశారు. గురువారం సాయంత్రం 5.30గంటల నుండి 7గంటల వరకు కీర్తిశేషులు బ్రహ్మశ్రీ పాండురంగారావు రామదాసు ఆశీస్సులతో బ్రహ్మశ్రీ లక్ష్మీనారాయణ పురాణపండిత్‌చే శివమాహాత్మ్యం ప్రవచనం రాత్రి 9గంటల నుండి 12గంటల వరకు బ్రహ్మశ్రీ మోహన్‌రావు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ ధార్మిక ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.